క్లుప్తంగా

నేడు ఉద్యోగ మేళా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని బీఎంఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజావెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ అలాగే డిగ్రీలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరీబజార్, ఎస్‌బీఐ బ్యాంక్, బురుజు, సుభాష్‌రోడ్డు, ఆర్‌కోట్ ఏరియా, గాంధీచౌక్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, మంగమ్మతోట, చార్వాదాన్ కాలనీ, నసీర్‌పుర, లాల్ కమాన్ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు; అలాగే మైత్రీవనం, ప్రియదర్శినికాలనీ, భవానీనగర్ ప్రాంతాలలో 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు 13లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వసంత రావు తెలిపారు. జూన్ 5 వరకు పట్టాపాస్ పుస్తకం వచ్చిన వారు అర్హులని చెప్పారు. మండలంలోని తిగుల్, జగదేవ్‌పూర్, ఇటిక్యాల, మునిగడప, తిమ్మాపూర్, చాట్లపల్లి రైతు వేదికల్లో దరఖాస్తులు స్వీకరింస్తారని, అలాగే మార్పులు చేర్పులు చేసుకునే రైతులు 12లోగా ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

వైభవం.. వెంకటేశ్వరుడి కల్యాణం


విశేష అలంకరణలో స్వామి అమ్మవార్లు

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజారి అజయ్ చార్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కల్యాణ క్రతువు కొనసాగింది. మహిళలు వెంకటేశ్వర ఒడి బియ్యం సమర్పించుకొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయంలో ఉత్సవాలు


పల్లకీసేవలో పద్మశాలీలు

దుబ్బాక: స్థానిక మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలీలు సామూహిక యజ్ఞోపవీతధారణ కార్యక్రమం జరిగింది. అనంతరం పట్టణంలో శివమార్కండేయ శావ ఊరేగింపు కనుల పండవగా కొనసాగింది. ఈ సందర్భంగా స్వామి వారిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు, సినీనటి కత్తి కార్తీక దర్శించుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాలయ్య, యువజన సంఘం అధ్యక్షుడు నరేశ్, పెద్దలు మధు, శ్రీరాం నరేందర్, రమేశ్, చంద్రశేఖర్, తిరుపతి, గురుచరణ్, అర్జున్, గాజుల భాస్కర్ తదితరులు ఉన్నారు.

పాడిగేదె మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పెరుకబండ గ్రామానికి చెందిన జతనం లక్ష్మి అనే మహిళా రైతుకు చెందిన పాడి గేదె ఇంటి సమీపంలో ఉన్న నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడి శనివారం మృతి చెందింది. పాలను విక్రయించి జీవిస్తున్నానని గేదె మృతితో జీవనాధారం కోల్పోయానని బాధితురాలు వాపోయింది. దాని విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఆర్థిక సహాయమందించి బాధితురాలిని ఆదుకోవాలని బీజేపీ నాయకులు సాన వేణు కోరారు.

అనుబంధం వికసించిన క్షణం

సెల్ఫీ విత్ రాఖీకి విశేష స్పందన

రాఖీ పండుగను పురస్కరించుకుని 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ విత్ రాఖీకి విశేష స్పందన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా శనివారం జరుపుకొన్న రాఖీ సంబురాల్లో పలువురు సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వచనాలు తీసుకొన్నారు. ఆ అనుబంధ క్షణాలను ఫొటోలలో బంధించి 'సాక్షి'తో పంచుకొన్నారు. వాటిలో కొన్ని..

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)


సిద్దిపేటలో తమ్ముడు త్రిషాన్‌కు రాఖీ కడుతున్న అక్క జాహ్నవిక


సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ రాజేశ్, సిబ్బందికి రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుల్


రాఖీ కట్టిన అనంతరం సోదరులతో సెల్ఫీ దిగుతున్న స్నేహదీపిక


కోహెడలో తన సోదరులకు రాఖీలు కట్టి హారతినిస్తున్న చిన్నారి ధ్రుతిక


కోహెడలో రాఖీలు కట్టిన అనంతరం సోదరులతో సెల్ఫీ


సిద్దిపేటకు చెందిన సాయిమనోహర్‌కు రాఖీ కట్టి సెల్ఫీ తీసుకొన్న అక్కలు సాయిదీపిక, దివ్య


నర్మెట గ్రామంలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు


రాఖీపై అన్నాచెల్లెళ్ల ఫొటో


కడవేర్గు గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమేశ్ కుటుంబంలో రాఖీలు కడుతున్న సోదరీలు


తమ్ముడుకి రాఖీ కడుతున్న అక్క



కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణకు రాఖీలు కడుతున్న మహిళా నాయకులు


సిద్దన్నపేటకు చెందిన తిరుపతికి రాఖీ కట్టి, హెల్మెట్ బహూకరిస్తున్న అక్క రేణుక


సిద్దిపేట మార్కండేయ ఆలయంలో పద్మశాలీల సామూహిక యజ్ఞోపవీతధారణ


సిద్దిపేటలో రాఖీ కట్టిన చెల్లెలు స్రవంతికి నూతన వస్త్రాలు అందిస్తున్న అన్నయ్యలు రాము, అభిలాష్


దుబ్బాకలో అన్నయ్య అభినయ్‌కి రాఖీ కడుతున్న చెల్లి అక్షితారెడ్డి


తొగుటలో సోదరులకు రాఖీ కడుతున్న చెల్లులు


రాఖీలు కట్టుకున్న అనంతరం చేర్యాలకు చెందిన నరేందర్ తన సెల్ఫీ


సిద్దిపేటజోన్: చెట్టుకు రాఖీ కడుతున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు శనివారం జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే అక్కా చెల్లెళ్లు అమ్మగారింటికి చేరుకుని అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. హారతులిచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. అన్నదమ్ములు వారి అక్కా చెల్లెళ్లకు కానుకలు ఇచ్చి ఆత్మీయ అనుబంధాలు పంచుకొన్నారు. అక్కా చెల్లెళ్ల రాకతో ఇళ్లు సందడిగా మారాయి.


దుబ్బాకటౌన్: మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్‌కు రాఖీ కడుతున్న రాయపోల్ మాజీ ఉప సర్పంచ్ సత్తవ్వ తదితరులు


గజ్వేల్‌రూరల్: పెళ్లి తంతు పూర్తయ్యాక తన తమ్ముడికి రాఖీ కడుతున్న నూతన వధువు మనిషా


జగదేవ్‌పూర్(గజ్వేల్): తమ్ముడికి రాఖీలు కడుతున్న అక్కలు


గుర్రాలగొంది గ్రామంలో రాఖీ కడుతున్న సోదరి


మిరుదొడ్డి(దుబ్బాక): సోదరులకు రాఖీలు కడుతున్న అక్కాచెల్లెళ్లు


తొగుట(దుబ్బాక): చిన్న ముత్యంపేటలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో రాఖీ పండగ

అనుచిత వ్యాఖ్యలను సహించం

ఎంపీటీసీల ఫోరం మాజీ నేత దేవీరవీందర్


విలేకరులతో మాట్లాడుతున్న దేవీ రవీందర్

గజ్వేల్: నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఆ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను సహించేదిలేదని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ హెచ్చరించారు. గజ్వేల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్‌రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు నిధులు సాధించడంలో మంత్రులు విఫలమయ్యారని ప్రభాకర్‌రెడ్డివిమర్శించారని గుర్తుచేశారు. అదేవిధంగా గతంలో ఇక్కడున్న ఇన్‌చార్జి మంత్రిని ఎందుకు మార్చారని కూడా ప్రశ్నించారని చెప్పారు. ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని దూషించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను సైతం బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. శ్రీనివాస్‌రెడ్డి వైఖరిని ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. సమావేశంలో నాయకులు మధు, నవాజీమీరా, స్వామి, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చండీ హోమం

హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో రాఖీ పౌర్ణమి పర్వ దినాన్ని పురస్కరించుకొని శనివారం చండీ హోమం నిర్వహించారు. మహా గణపతి పూజ, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, కుంకుమ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి కిషన్‌రావు, అర్చకులు తాటికొండ పరమేశ్వర్, వినయ్ శర్మ, శరత్ చంద్ర, భక్తులు పాల్గొన్నారు.


హోమం పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సంతోషిమాత జన్మదిన వేడుకలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి వివిధ అభిషేకాలు, పుష్పాలంకరణ తదితర కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

లోక కల్యాణం కోసం నవావరణ హవనం


నవావరణ హవనం నిర్వహిస్తున్న వేద పండితులు.. పాల్గొన్న భక్తులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శనివారం శ్రావణమాస పౌర్ణమి వేడుకల్లో భాగంగా లోక కల్యాణం కోసం నవావరణ హవనాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు క్షేత్రం నిర్వాహకులు చెప్పల హరినాథ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజతో వేడుకలు ప్రారంభించారు. గౌరీమాతగా విజయదుర్గ భక్తులకు దర్శనమిచ్చారు. సుహాసినులు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. శ్రావన మాసం కావడంతో భక్తులు దేవాలయానికి అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో మోహనకృష్ణ శర్మ, వేదవ్యాస్ శర్మ, కిశోర్ పాండే, మల్లికార్జున్, రాజశేఖర వర్మ, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఆదివాసీ దినోత్సవం

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి మినీ గిరిజన బాలికల గురుకులంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు గిరిజనుల సంప్రదాయ దుస్తులు ధరించి ఆటాపాటలతో అలరించారు. విద్యార్థినులకు రంగోలీ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.


చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు